క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: హైదరాబాద్ రామంతాపూర్‌లోని పబ్లిక్ స్కూల్‌లో జిల్లా ఎస్టీలకు ఆరు సీట్లు కేటాయించినట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం అర్హులైన ఎస్టీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. లంబాడీలకు 4, ఎరుకల వారికి 1, ఇతరులకు 1 చొప్పున కేటాయించిన సీట్ల కోసం 1.5లక్షల వార్షికాదాయం ఉన్న తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కరీంనగర్‌లోని గిరిజనాభివృద్ధి కార్యాలయం నుంచి దరఖాస్తులు సేకరించి పుట్టిన తేదీ నిర్ధారణ పత్రం, కులం, ఆదాయం నివాస ధ్రువపత్రాలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఈనెల 18లోపు అందించాలన్నారు. ఆరుకంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ విధానంలో అర్హులను ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు కరీంనగర్ కలెక్టరేట్ కాంప్లెక్స్ రెండో అంతస్తులోని గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయం లేదా 9652118867 సెల్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



మాట్లాడుతున్న కంచర్ల రవిగౌడ్

సిరిసిల్లటౌన్: బీసీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీమేరకు 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నేత కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని హామీని విస్మరించి మోసం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ మాత్రం బీసీల సంక్షేమం కోసం పనిచేసిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు బీసీల రిజర్వేషన్ అమలయ్యాకే జరిపించాలన్నారు. నాయకులు వడ్లూరి సాయి, సూర్య, ముద్దం అనిల్ గౌడ్, ఎస్.కే అప్రోచ్, కోడం వెంకటేశం, వడ్లూరి వేణ, జమీర్, హరీష్, అమ్ము తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్లటౌన్: కార్మిక, కర్షకుల సమస్యల సాధనకు సీపీఐ పార్టీ నిరంతర పోరాటాలు చేస్తుందని ఆపార్టీ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ అన్నారు. శ్రామికవర్గాల సమస్యల సాధనలో భాగంగా ఈనెల 19 నుంచి 22 వరకు జిల్లా మహాసభలు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో నిర్వహిస్తున్నామన్నారు. సంబంధిత పోస్టర్లను మంగళవారం కార్మిక భవనంలో ఆవిష్కరించారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బీసీ బిల్లును తీసుకువస్తే దానికి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అడ్డుపడుతూ పైగా ప్రభుత్వంపై నిందలు మోపుతున్నాయని విమర్శించారు. రాష్ట్ర భారత కమ్యూనిస్టు పార్టీ నాలుగో మహాసభల విజయవంతానికి ఈ ప్రాంత ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు, మీసం లక్ష్మణ్, అనసూర్య, నాగరాజు, వేణు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు



గంభీరావుపేట: గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మంగళవారం నుంచి క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. పంద్రాగస్టును పురస్కరించుకొని విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మీ తెలిపారు. పోటీలను ఆమె ప్రారంభించారు. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్వశక్తి మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఏపీఎం జయసుధ

ముస్తాబాద్: స్వశక్తి సంఘాల మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఏపీఎం జయసుధ అన్నారు. ముస్తాబాద్ శుభోదయ మండల సమాఖ్యలో గ్రామైక్య సంఘాల బాధ్యులకు మంగళవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో మహిళా సంఘాల్లో సభ్యులుగా లేని వారిని గుర్తించి, వారితో స్వశక్తి సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. కిశోర బాలికలు, వృద్ధులు, దివ్యాంగుల సంఘాలను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఈనెలాఖరులోగా వారి పేరిటా బ్యాంక్ ఖాతాలు తెరవాలన్నారు. సీసీలు లక్ష్మణ్, శోభన్, రాజేశ్వరి, బాబు, లీలారాణి, పద్మ, సరోజన తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు పరిశీలన

తంగళ్లపల్లి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని, వెంటనే చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హౌజింగ్ పీడీ ఆర్.శంకర్ అన్నారు. మంగళవారం మండెపల్లి, రాళ్లపేటలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హౌజింగ్ డీఈ ఖాజా ముజఫరుద్దీన్, ఎంపీడీవో కె.లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు వినయ్, ప్రశాంత్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదం

- పరిమితికి మించి వెళ్తున్న వైనం
- అతివేగంతో చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలు
- నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానాలు

మూడునెలల్లో కేసులు ఇలా

హెల్మెట్ లేకుండా బైక్ నడిపినవారు	1,231
ట్రిపుల్ రైడింగ్	128
వాహనాలు నడిపిన మైనర్లు	15మంది



వీర్నపల్లిలో బైక్‌పై ఐదుగురు ప్రయాణం (ఫైల్)

వీర్నపల్లి: మండలంలోని ప్రధాన రహదారులపై ఇటీవల ప్రమాదాలు పెరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు పోలీసు అధికారులు తనిఖీలు చేపడుతున్నా ఎవరూ నిబంధనలు పాటించడం లేదు. లైసెన్సులు లేనివారికి జరిమానాలు విధిస్తున్నారు. అధికారులు ఇంత చేస్తున్నా ఏమాత్రం లెక్కచేయడం లేదు. ద్విచక్రవాహనాలపై పరిమితికి మించి వెళ్లడం, అతివేగంతో వెళ్లడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి ప్రమాదాల్లో బాధితులకు ఇన్సూరెన్స్ సైతం లభించదని పోలీసు అధికారులు తెలుపుతున్నారు.

భారీగా జరిమానాలు

రోడ్డు నిబంధనలు పాటించని వారికి పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు. రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్న యువకులపై పోలీసులు కొరఢా ఝుళిపిస్తున్నారు. గీత దాటితే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. జరిమానాలు చెల్లించకుండా తప్పించుకునేందుకు తిరుగుతున్న వారిని పట్టుకొని వసూలు చేసేలా చర్యలు చేపట్టారు. అతివేగంగా, మద్యంతాగి వాహనాలు నడిపేవారు, పరిమితికి మించి ప్రయాణిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి భారీగా జరిమానాలు విధిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



ఇద్దరికి మించి బైకుపై ప్రయాణించొద్దు. ముగ్గురు వెళ్తే ప్రమాదాలు జరిగితే బీమా కూడా వర్తించదు. దీనిపై ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నాం. అయినా పట్టించుకోని వారిపై చర్యలు తీసుకుంటున్నాం.

– వేముల లక్ష్మణ్, వీర్నపల్లి ఎస్సై

కార్మికవాడల్లో వసతులు కల్పించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మూశం రమేశ్, తదితరులు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని కార్మికవాడల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. మంగళవారం 21వ వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏ ఖదీర్‌పాషాకు వినతిపత్రం అందించారు. పట్టణశివారులోని గణేశ్‌నగర్ అభివృద్ధికి ఎమ్మెల్యే కేటీఆర్, మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కేటీఆర్ అన్ని ప్రాంతాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామని చెప్పినా ఆచరణలో శూన్యమన్నారు.గణేష్‌నగర్‌లో కాలనీలు ఏర్పడి 30 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు రోడ్లు, మురుగుకాలువలు నిర్మించకపోవడం శోచనీయమన్నారు. వెంటనే నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించాలని, లేకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర, నిరాహార దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జవ్వాజి విమల, నాయకులు. నక్క దేవదాస్, రాజు, ఉమాపతి, గాజుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

వేములవాడ: మూడు రోజులపాటు ఇళ్లపై జాతీయ జెండాలను ఎగురవేసి జాతీయ భావాన్ని ప్రదర్శించాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం జాతీయజెండాలతో బైక్‌ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు సుభాష్‌నగర్‌లోని సుభాష్‌చంద్రబోస్ విగ్రహాన్ని శుద్ధిచేసి నివాళి అర్పించారు. పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్, రేగుల మల్లికార్జున్, పిన్నింటి హన్మండ్లు, సంటి మహేశ్, చందనం రవి, కృష్ణస్వామి, శ్రీకాంత్, వంశీ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్ మండలంలో...



వేములవాడ రూరల్ : బైక్ ర్యాలీ తీస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం మల్లారం, హన్మాజిపేట, లింగంపల్లి, బొల్లారంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. మల్లారంలో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేశ్, నాయకులు మల్లేశం, సుంకరి నరేందర్, తోట శేఖర్, లింగంపల్లి కుంటయ్య, చొప్పరి కరుణాకర్, లింగంపల్లి రాజు, ఆది జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలకేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. మండలశాఖ అధ్యక్షుడు కోడె రమేశ్, జిల్లా కన్వీనర్ మల్లారం సంతోష్‌రెడ్డి, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొక్కు దేవేందర్ యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, మాజీ మండల అధ్యక్షుడు గంట అశోక్, నాయకులు రాజేందర్‌రెడ్డి, మల్లేశ్ యాదవ్, విగ్నేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల మంజూరు పత్రాలు పంపిణీ



పంపిణీ చేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: మండలంలోని రామన్నపల్లెలో మంగళవారం పలువురికి కాంగ్రెస్ నాయకులు రేషన్ కార్డుల మంజూరుపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల కడుపు నింపడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమన్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ నాయకుల మందాటి తిరుపతి యాదవ్, తిరుపతి, నక్క సురేశ్, దేవయ్య, గుండి శ్రీనివాస్, మహేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి అన్నారు. మండలంలోని నామాపూర్‌లో రేషన్‌కార్డుల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు పేదలకు రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ వెల్ముల రాంరెడ్డి, డీసీసీ జిల్లా కార్యదర్శి కొండం రాజిరెడ్డి, కొంరయ్య, రాజు, ప్రశాంత్, శ్రీను గౌడ్, బాల్‌రెడ్డి, అనిత తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం




భీమేశ్వరాలయంలో హనుమాన్ చాలీసా పారాయణంలో భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ అనుబంధ ఆలయమైన భీమేశ్వరాలయంలో, ప్రతీ మంగళవారం హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న హనుమాన్ చాలీసా పారాయణం 100వ మంగళవారం చేరడంతో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. రాజన్న ఆలయం నుంచి భీమేశ్వరాలయం వరకు నగర సంకీర్తన నిర్వహించి, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్లకల్చరల్: శివనగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని లైబ్రేరియన్ ఎన్ సరోజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, ఎస్ఆర్ రంగనాథన్ జయంతి సందర్భంగా గ్రంథాలయ దినోత్సవం జరుపుతున్నట్లు తెకలిపారు. విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ కనకశ్రీ విజయ రఘునందన్, లెక్చరర్లు సామల వివేకానంద్, బుర్ర వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

కుంకుమ పూజలు



పూజల్లో పాల్గొన్న మహిళలు

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని గంగాధర క్షేత్ర ఆలయంలో శ్రావణమాసం మూడవ మంగళవారం సందర్భంగా సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. అమ్మవారిని గాజులతో అలంకరించారు. పూజల్లో మహిళలు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రెడ్డి సంఘం కార్యవర్గం

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కడారి రాంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఆసాని మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాగిపెల్లి భూపాల్ రెడ్డి, కోశాధికారిగా పాతూరి సురేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా నేబురి సంజీవరెడ్డి, ఆసాని దేవిరెడ్డి, సత్తు బాపురెడ్డి, గనుప నారాయణ రెడ్డి, సత్తు రాజిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సభకు తరలిన నాయకులు



సిరిసిల్లటౌన్: రాజన్న సిరిసిల్ల ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చలో ముదిరాజ్..చలో హైదరాబాద్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున నేతలు తరలివెళ్లారు. మంగళవారం తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి ఆవిర్భావ సభకు బస్సుల్లో వెళుతూ..సిరిసిల్లలో ప్రదర్శన జరిపారు. జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చొక్కాల రాముల మాట్లాడుతూ..ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ డీ నుంచి బీసీ కు మార్చాలన్నారు. కంకణాల భద్రాచలం, బాబు, వెంకటస్వామి, రామచంద్రం, దేవన్న, శ్రీనివాస్ అన్ని మండలఅధ్యక్షుడు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ

వేములవాడరూరల్: వేములవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వేములవాడ రూరల్ మండలంలోని అన్ని గ్రామాలకు 444 బస్తాల యూరియా పంపిణీ చేసినట్లు ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 507 టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ**



ముస్తాబాద్: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో 90 మందికి రూ.30లక్షల విలువ చేసే చెక్కులను మంగళవారం అందజేశారు. ఇక్కడ ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, వైస్‌చైర్మన్ వెల్ముల రామ్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, కొండం రాజిరెడ్డి, దీటి నర్సింలు, గుండెల్లి శ్రీను, కొండల్‌రెడ్డి, ప్రశాంత్, నరేశ్, విజయ్, భాను, బాల్‌రెడ్డి, కొండయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

- **సంస్కృత భాషా వారోత్సవాల ముగింపు**

వేములవాడఅర్బన్: పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి సంస్కృత విద్యాసంస్థలో సంస్కృత భాష వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ముగింపు సమావేశం నిర్వహించారు. సమావేశానికి డాక్టర్ చంద్రాప్రకాశ్ హాజరై మాట్లాడారు. నేటి ఆధునిక విజ్ఞానానికి సంస్కృత సాహిత్యం గొప్ప భాండాగారమన్నారు. సంస్కృత విద్యాసంస్థల పర్యవేక్షకుడు శ్రీనివాస్ శర్మ మాట్లాడుతూ దేవస్థానం వారు సంస్కృత భాష అభివృద్ధికి ఎంతో ఖర్చు చేస్తున్నారని, చిన్నారులు బాగా చదివి భారతీయ సంస్కృతి సంప్రదాయాలు చాటి చెప్పాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు భక్తియర్, సందవేని తిరుపతి, ఉపాధ్యాయులు నాగజ్యోతి, శ్రీకాంత్, రవి, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు

- **జాతీయ గ్రంథాలయ దినోత్సవం**

వేములవాడఅర్బన్: గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథ్ గ్రంథాలయ శాస్త్రానికి ఎంతో కృషి చేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని న్యూఅర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో జాతీయ గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పుస్తక పఠనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

- **వ్యక్తిత్వ వికాసంపై అవగాహన**

గంభీరావుపేట: మండలంలోని నర్మాల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు మంగళవారం వ్యక్తిత్వ వికాసంపై ప్రముఖ సైక్రియాటిస్ట్ ప్రవీణ్‌కుమార్ అవగాహన కల్పించారు. మానసిక రుగ్మతల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సృజన, సీహెచ్‌వో రమేశ్, ఏఎన్ఎంలు రజిత, సిబ్బంది భారతి, రమాదేవి పాల్గొన్నారు.

- **ఎంపీడీవో పరిశీలన**

ముస్తాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఎంపీడీవో లచ్చాలు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలిలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి వసతి, కేంద్రంలో ర్యాంప్ నిర్మాణం, విద్యుత్ తదితర సౌకర్యాలు, పరిశీలించామన్నారు. ముస్తాబాద్, చీకోడు, చిప్పలపల్లి గ్రామాల్లోని కేంద్రాలు పరిశీలించినట్లు తెలిపారు.

- **ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తి రిమాండ్**

వేములవాడఅర్బన్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెడ్డవేని పర్శరాములుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ టౌన్ ఎస్సై రామ్మోహన్ తెలిపారు. వేములవాడ మండలం సంకెపల్లి శివారు మూలవాగులో సోమవారం ఇసుక అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు అక్కడి చేరుకొని పర్శరాములు అనే వ్యక్తిని అనుమతిపత్రాలు చూపించాలన్నారు. పోలీసులతో దురుసుగా ప్రవర్తించడంతో మంగళవారం పర్శరాములును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

- **డ్రంకెన్ డ్రైవ్‌లో 21మందికి జరిమానా**

ఇల్లంతకుంట: మద్యంతాగి వాహనాలు నడిపిన 21 మందికి సిరిసిల్ల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జయశ్రీ జరిమానా విధించినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. 19 మందికి రూ.19వేలు, ఇద్దరికీ రూ.8,వేలు జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.



మధ్యమానేరు విలవిల

మెట్టప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే మధ్యమానేరు జలాశయం నీటి ఎద్దడితో వెలవెలబోతోంది. 25 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్‌లో ప్రస్తుతం 7.5 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఓ వైపు వర్షాభావం.. మరోవైపు కాళేశ్వరం నుంచి ఎత్తిపోతలు లేకపోవడంతో జలాశయం నీరు లేక నిండుకుంది. దీనిపైనే ఆధారపడ్డ రైతులు ఆందోళన చెందుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల



ఘనంగా యువజన దినోత్సవం



పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

వేములవాడరూ'ల్: వేములవాడ పరిధిలోని శాత్రాజుపల్లిలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవం, లైబ్రేరియన్‌ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు దేశాభివృద్ధిలో యువత పాత్ర, ప్రాముఖ్యతపై ఉపన్యాసాలు, పాటల రూపంలో వివరించారు. ప్రిన్సిపాల్ కె. లావణ్య మాట్లాడుతూ గ్రంథాలయానికి వెళ్లడంతో పఠనాసక్తి, భాషా నైపుణ్యం ,సృజనాత్మకత పెరుగుతుందన్నారు. గ్రంథాలయం మన భవిష్యత్‌ను నిర్మించే సాధనమన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ కో ఆర్డినేటర్ ఎస్. సంధ్యారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ స్వప్న, గ్రంథాలయ విభాగాధిపతి డాక్టర్ జి. శ్రీలత, ఎన్ఎస్ఎస్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులు జి. స్వప్న, రజిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యం



చందుర్తి: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు



ఎల్లారెడ్డిపేట: ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: కొత్త పింఛన్ విధానాన్ని రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు నీలి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం తంగళ్లపల్లి, మండెపల్లి, గండిలచ్చపేట, కస్బేకట్కూర్, జిల్లెల్ల ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదులు చేపట్టి మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని, సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఐరెడ్డి సాంబరెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగయ్య, నాయకులు మహేందర్, దేవదాస్, ప్రభాకర్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: చలో హైదరాబాద్ మహాధర్నాను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్ కోరారు. చందుర్తి ఉన్నత పాఠశాల చలో హైదరాబాద్ మహాధర్నాపోస్టర్ ఆవిష్కరించి, పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాసాచారి, జిల్లా అసోషియేట్ అధ్యక్షుడు మాడిశెట్టి మహేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడెపు గోవర్ధన్, మండల ఉపాధ్యక్షులు పల్లెనెని రమేష విజయ, లక్ష్మీ, నర్మద, జువ్వాడి సంపత్ రావు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. పీఆర్టీయూ సభ్యత్వ నమోదులో భాగంగా మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. సెప్టెంబర్ 1న పాత పింఛన్ సాధన లక్ష్యంగా హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ.. ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు గరుగుల కృష్ణహరి, మండల ప్రధాన కార్యదర్శి బొల్లి భగవాన్, జిల్లా ఉపాధ్యక్షుడు బాబు, మధు, మల్లారెడ్డి, ఆనంద్, సామల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకలు



సిరిసిల్లలో ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

సిరిసిల్ల టౌన్: జిల్లా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. బీసీ కళాశాల బాయ్స్ హాస్టల్ ఆవరణలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్‌కుమార్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. భవిష్యత్‌లో జిల్లావ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేశ్, జిల్లా నాయకులు సొల్లు సాయి, జామచెట్టి ఈశ్వర్, ఆకారం రేవంత్, రాగూడ ప్రణయ్, రాకేశ్, అరవింద్, సాయి హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: విద్యార్థులు, విద్యారంగ సమస్యలపై నిత్యం పోరాటం ఏఐఎస్‌ఎఫ్ పోరాడుతుందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పెండేల ఆదిత్య అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. మండల ఏఐఎస్‌ఎఫ్ అధ్యక్షుడు బండారి చందుగౌడ్, సాయి, దొమ్మాటి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

దేవానందంకు సన్మానం



సిరిసిల్లకల్చరల్: జిల్లాకేంద్రానికి చెందిన కవి, మానసం ఉపాధ్యక్షుడు బూర దేవానందంను హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర భాష, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గోలి విజయ వెలువరించిన నవరాగిణి గజల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. హాజరైన బూర దేవానందంను నిర్వాహకులు ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ప్రముఖ కవి బిక్కికృష్ణ, భాష, సాంస్కృతిక శాఖ సంచాలకుడు హరికృష్ణ, మల్లె తీగ పత్రిక సంపాదకుడు మానశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నిరసనకు పిలుపునివ్వకున్నా అరెస్టులా?

కోనరావుపేట: ఎలాంటి నిరసనలు, బంద్‌లకు పిలుపునివ్వకున్నా అరెస్టులు చేయడం ఏంటని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు పూజం కార్తీక్ అన్నారు. ఏబీవీపీ నాయకులను పోలీసులు మంగళవారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎలాంటి బంద్‌కు పిలుపునివ్వలేదని, అయినా అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ఆయన వెంట మండల కన్వీనర్ ఇట్టిరెడ్డి గణేశ్ రెడ్డి ఉన్నారు.

కుక్కదాడిలో ఒకరికి గాయాలు

కోనరావుపేట: మండలంలోని చాంద్‌నగర్ (నిజామాబాద్)కు చెందిన సయ్యద్ ఖరీం అనే వృద్ధుడు మంగళవారం కుక్కదాడిలో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు అతనిని మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు.